

భద్రతా లక్ష్యాల సాధనలో..

భారత్, అమెరికా దేశాలు సంయుక్తంగా కాకినాడ బీచ్‌లో నిర్వహిస్తున్న ఎక్సర్‌సైజ్ టైగర్ ట్రయంఫ్ శుక్రవారం ఘనంగా ముగిసింది.


10లో



క్షేత్రం నుంచి క్షాత్రానికి!

వ్యవసాయంలో అన్నదాతకు ఎంతో సాయంగా నిలిచే వృషభ రాజాలు నేడు పరుగు పందేలతో ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి.

డెల్టాకు 8,100 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,900, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 4,700 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.10 అడుగులుగా నమోదైంది.

క్లోజర్‌పై నజర్

- 16 నుంచి కాటన్ బ్యారేజీ నుంచి నీటి విడుదల నిలిపివేత
- అనంతరం కాలువల నిర్వహణ పనులు
- ఉమ్మడి జిల్లాలో రూ.40 కోట్లతో ప్రతిపాదనలు
- నామినేషన్ పద్ధతిలో నీటి సంఘాలకు అప్పగించేందుకు పావులు
- ఆ ముసుగులో కన్ను వేసిన కూటమి నేతలు



చాగల్లు మండలం నెలటూరు పేముల కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

సాక్షి, రాజమహేంద్రవరం: 'తినమరిగిన దాసప్ప.. పదం మర్చిపోయినట్లు'గా మారింది కూటమి నేతల వ్యవహార శైలి. పథకం ఏదైనా దోపిడీయే పరమావధిగా మారుతోంది. ఇప్పటికే ఇసుక, మద్యంలో రూ.లక్షల అక్రమాలకు పాల్పడుతున్న నేతలు తాజాగా జలవనరుల శాఖపై దృష్టి సారించారు. ఇరిగేషన్‌లో చేపట్టనున్న క్లోజర్ పనులు దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఆ శాఖ అధికారులు సైతం నామినేషన్ పద్ధతిలో నీటి సంఘాలకు పనులు కట్టబెట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ తరుణంలో వాటిని హస్తగతం చేసుకునే పనిలో కూటమి నేతలు తలమునకలవుతున్నారు. నీటి సంఘాల్లో సైతం వారే ఉండటం, అధికార అండదండలు కూడా పుష్కలంగా ఉండటంతో పనులు దక్కించుకుని, కాసులు పండించుకునేందుకు వ్యూహరచన చేస్తున్నారు.

ఇదీ సంగతి

ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సాగునీరు విడుదల చేస్తుంటారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 4.80 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. ఈ ఏడాది డెల్టాలో రబీ పంట పొలాలకు ఏప్రిల్ 20వ తేదీ వరకూ సాగునీరు ఇవ్వాల్సి ఉంది. అయితే, ఈ నెల 16వ తేదీ నుంచే కాలువలకు నీటి విడుదల ఆపేయాలని ఇరిగేషన్ అధికారులు నిర్ణయించుకున్నారు. నీటి సరఫరా నిలిపివేసిన కాలంలో కాలువల నిర్వహణ (క్లోజర్) పనులపై దృష్టి సారించారు. ఈ పనుల్లో భాగంగా గుర్రపుడెక్క, పూడికల తొలగింపు, లాకులు, స్లూయిజ్‌ల వంటి వాటికి మరమ్మతులు తదితర పనులు చేపడతారు. ఈ విధంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 18 నియోజకవర్గాల పరిధిలో 972 పనులు చేపట్టాలని నిర్ణయించారు. దీనికిగాను సుమారు రూ.40 కోట్లు అవసరమని ప్రతిపాదనలు రూపొందించి, ప్రభుత్వానికి పంపారు. తొలుత ఒక్కో నియోజకవర్గంలో రూ.10 కోట్ల విలువైన పనులు చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. అనంతరం బడ్జెట్ గణనీయంగా తగ్గించేశారు. ఒక్కో నియోజకవర్గానికి రూ.2 కోట్ల వరకూ మాత్రమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్న ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు జలవనరుల శాఖ తిరిగి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి బుధవారం పంపించింది. ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ అందిన వెంటనే పనులు ప్రారంభించనున్నారు.

టెండర్లకు టెండర్..?

పనులు త్వరితగతిన చేపట్టాలన్న తలంపుతో క్లోజర్ పనులకు జలవనరుల శాఖ టెండర్ల ప్రక్రియ చేపట్టడం లేదు. ఈ పనులను నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టేందుకు సన్నద్ధమవుతోంది. సమయం తక్కువగా ఉండటంతో టెండర్లు, ఇతర ప్రక్రియలతో పెద్ద పనులు సకాలంలో పూర్తి కావనే అంశాన్ని సాకుగా చూపి నామినేషన్ పద్ధతికే ప్రాధాన్యమిస్తున్నారు. తద్వారా కూటమి నేతలకు లాభం చేకూర్చేందుకు ప్రభుత్వ పెద్దలు పావులు కదుపుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని కాలువల్లో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క తొలగింపు, స్లూయిజ్‌ల నిర్వహణ, అవసరమైన ప్రాంతాల్లో కాలువల్లో పూడికతీత చేపట్టనున్నారు. ఒక్కో పని రూ.10 లక్షలలోపు అంచనాతో నిర్ణయించి, నామినేషన్ విధానంలో సాగునీటి సంఘాల ప్రతినిధుల పర్యవేక్షణలో చేపడతారు. ఇక్కడే అసలు దోపిడీకి మార్గం ఏర్పడుతోంది. ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో సింహభాగం కూటమి నేతలే దక్కించుకున్నారు. ఈ పరిస్థితుల్లో క్లోజర్ పనులు వారి కనుసన్నల్లో నిర్వహిస్తే నాణ్యత ఏ మేరకు ఉంటుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. కేవలం కూటమి నేతలకు ఆర్థిక అండ కల్పించేందుకే టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిలో పనులు చేపడుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. టెండర్లు ఆహ్వానిస్తే ఇతరులు దక్కించుకునే అవకాశం ఉంటుందని, అదే జరిగితే కూటమి నేతలకు ఎటువంటి ప్రయోజనమూ ఉండదని భావించి నామినేషన్ పద్ధతిలో పనులు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని తెలుస్తోంది. టెండర్ల ద్వారా పనులు అప్పగిస్తే బాధ్యత, పారదర్శకత ఉంటాయని, అదే నామినేషన్ పద్ధతిలో కేటాయిస్తే తూతూమంత్రంగా పనులు చేపట్టి, చేతులు దులిపేసుకున్నా ప్రశ్నించే అవకాశం ఉండదనే భావన రైతుల్లో కలుగుతోంది.

అధ్వానంగా కాలువలు

గోదావరి డెల్టా పరిధిలోని పంట కాలువలు, చానల్స్ అధ్వానంగా ఉన్నాయి. ఈ ఏడాది రబీ సాగు ప్రారంభంలో షార్ట్ క్లోజర్ పనులు చేపడతామని అధికారులు ప్రకటించారు. కానీ, ఆ దిశగా ఎటువంటి పనులూ చేపట్టిన దాఖలాలు లేవు. వెరసి కాలువల్లో పూడిక, గుర్రపు డెక్క అలాగే ఉండిపోయాయి. ఫలితంగా రబీలో శివారు ప్రాంత రైతులు నీటి ఎద్దడితో సతమతమయ్యారు.. అవుతున్నారు. దీనికి తోడు పంట కాలువల ద్వారా వస్తున్న నీటిని ఆక్వా రైతులు మోటార్లతో తోడేయడంతో శివారు ప్రాంతాలకు సాగు నీరు అందని పరిస్థితులు నెలకొన్నాయి.

ఉమ్మడి జిల్లాలో క్లోజర్ ప్రతిపాదనలివీ..

పనులు చేపట్టనున్న నియోజకవర్గాలు	18
మొత్తం పనులు	972
వ్యయం అంచనా	రూ.40 కోట్లు

తూర్పు గోదావరి జిల్లాలో పనులు ఇలా...

జిల్లా వ్యాప్తంగా 149 పనులను గుర్తించారు. రూ.6.94 కోట్లు వెచ్చించనున్నట్లు అంచనాలు రూపొందించారు.

నియోజకవర్గం	పనులు	ప్రతిపాదిత అంచనా (రూ.కోట్లలో)
నిడదవోలు	64	2.21
అనపర్తి	31	1.17
కొవ్వూరు	28	2.02
గోపాలపురం	16	0.92
రాజమహేంద్ర వరం రూరల్	10	0.63

టెండర్లకు ప్రాధాన్యం ఇవ్వాలి



సాగునీరు శివారు ప్రాంతాలకు చేరాలంటే కాలువల్లో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులు పారదర్శకంగా చేపట్టాలి. టెండర్లు ఆహ్వానిస్తేనే పనుల నిర్వహణలో అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చు. నామినేషన్ పద్ధతిలో కేటాయిస్తే బాధ్యత ఉండదు. అక్రమాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది.

– విప్పర్తి వేణుగోపాలరావు, జిల్లా పరిషత్ చైర్మన్, ఉమ్మడి తూర్పు గోదావరి

నేడు ఇంటర్ ఫలితాలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియెట్ ఫలితాలు శనివారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. గత నెల 1 నుంచి 19వ తేదీ వరకూ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 127 జూనియర్ కళాశాలలుండగా 51 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల స్పాట్ వేల్యుయేషన్ గత నెల 17 నుంచి ఈ నెల 4వ తేదీ వరకూ నిర్వహించారు. ఈ పరీక్షల ఫలితాలను మన మిత్ర వాట్సాప్ నంబర్ 95523 00009కు హాయ్ అని మెసెజ్ పంపడం ద్వారా చూసుకోవచ్చు. అలాగే డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.రిజల్ట్స్‌బీఐఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో కూడా చూసుకోవచ్చు. ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం 22,817 మంది, రెండో సంవత్సరం 20,937 మంది కలిపి మొత్తం 43,754 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. నూరు శాతం ఫలితాలు లక్ష్యంగా ఇంటర్ బోర్డు అధికారులు కార్యాచరణ రూపొందించి, అమలు చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. పరీక్షల్లో ఉత్తీర్ణత, మంచి మార్కులు ఎలా సాధించాలనే దానిపై అవగాహన కల్పించారు. నమూనా పరీక్షలు నిర్వహించారు.

బీఈడీ రికార్డుల మూల్యాంకనం పరిశీలన



మూల్యాంకనం చేస్తున్న సిబ్బందికి సూచనలిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో జరుగుతున్న బీఈడీ రికార్డుల మూల్యాంకనాన్ని ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ శుక్రవారం పరిశీలించి, సిబ్బందికి సూచనలిచ్చారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలోని అనుబంధ కళాశాలల విద్యార్థులకు చెందిన 2,500 రికార్డుల మూల్యాంకన ప్రక్రియను ఇక్కడి సెమినార్ హాలులో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

స్ఫూర్తిప్రదాత ఫూలే



ఫూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): సమాజంలో చైతన్యం తీసుకురావడం ద్వారా మహాత్మా జ్యోతిరావు ఫూలే స్ఫూర్తిప్రదాతగా నిలిచారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఫూలే జయంతి సందర్భంగా గోదావరి గట్టున ఉన్న ఆయన విగ్రహానికి కలెక్టర్ శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, దేశంలో మహాత్మా అని గాంధీజీని, ఫూలేను మాత్రమే పిలుచుకుంటామని అన్నారు. అభివృద్ధి ఫలాలు అందని అణగారిన వర్గాల కోసం పోరాడిన మహనీయుడు ఫూలే అని అన్నారు. వెనుకబడిన వర్గాల వారు అభివృద్ధి చెందడానికి చదువు ఎంతో అవసరమని చాటిచెప్పారన్నారు. స్త్రీ విద్యను ప్రోత్సహిస్తే కుటుంబం, తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని నమ్మి ఆచరణలో చూపించిన వ్యక్తి జ్యోతిరావు ఫూలే అని కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు. ఫూలే జయంతి సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిమ ప్రతిభ చూపిన 110 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఫూలే సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యాన రూ.1.10 లక్షలు, బీసీ కార్పొరేషన్ ద్వారా 144 మంది బీసీ, కాపు, ఈబీసీ వర్గాల లబ్ధిదారులకు రూ.352 లక్షల చొప్పున స్వయం ఉపాధి పథకాల అమలుకు ఆర్థిక సహాయం అందించామని కలెక్టర్ తెలిపారు.

చంద్రబాబువి డైవర్షన్ పాలిటిక్స్



మాజీ మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: ఐ-టీడీపీతో ముఖ్యమంత్రి చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మండిపడ్డారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మీడియా ముందు చేబ్రోలు కిరణ్‌తో మాట్లాడించడం, తప్పు అని చెప్పడం, క్షమాపణ కోరడం, అరెస్టు చేయడం అన్నీ చంద్రబాబు, ఐ-టీడీపీ స్క్రిప్ట్‌లో భాగమేనని పేర్కొన్నారు. టీడీపీ అనుకూల మీడియాలో డిబేట్లు చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడకు వెళ్లినా ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి కూటమి ప్రభుత్వం ఓర్వలేకపోతోందని అన్నారు. మహాశక్తి లాంటి వైఎస్ జగన్‌ను అడ్డుకునేందుకు అబద్ధాలు ప్రచారం చేయడంతో పాటు, ఆయన కుటుంబంపై దారుణ వ్యాఖ్యలు చేయడం ద్వారా వారిని మనోవేదనకు గురి చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాప్తాడులో వైఎస్ జగన్‌కు సరైన భద్రత కల్పించలేదన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ప్రజలు అన్ని విషయాలూ గమనిస్తున్నారని, తగిన బుద్ధి చెబుతారని చెప్పారు. ఇప్పటికైనా చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ మాని, ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలని వేణు హితవు పలికారు.

షార్ట్‌టర్మ్ ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన సమ్మర్ ఆన్‌లైన్ షార్ట్‌టర్మ్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం-2025 ప్రారంభిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీజీడీ మురళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మూడు, నాలుగో సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. సీఎస్‌ఈ, ఐటీ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ శాఖల విద్యార్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రెండు నెలల పాటు కొనసాగే ఈ ఇంటర్న్‌షిప్‌లో 80 గంటల థియరీ, 40 గంటల ప్రాక్టికల్ తరగతులు నిర్వహిస్తారని వివరించారు. ప్రధాన కోర్సుల్లో ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కంప్యూటింగ్, ఆండ్రాయిడ్ డెవలప్‌మెంట్, డేటా అనాలిసిస్ పైథాన్, డిజంగో వెబ్ డెవలప్‌మెంట్, ఎంబెడెడ్ సిస్టమ్స్, యూనిటీ 3డీ గేమింగ్ డిజైన్, కాటియా ఎక్స్‌పర్ట్ డిజైన్ రెవిట్ ఆర్కిటెక్చర్ మోడలింగ్ తదితర కోర్సులలో నైపుణ్యం పెంచేందుకు ఆన్‌లైన్‌లో ఈ శిక్షణ ఇస్తారని మురళి తెలిపారు. రోజువారీ క్విజ్‌లు, వారానికోసారి అసెస్‌మెంట్లు, ప్రాజెక్ట్ సమీక్ష కూడా ఉంటాయని పేర్కొన్నారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ఏపీఎస్ఎస్‌డీసీ నుంచి సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ.1,000 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. తొలి విడత ఇంటర్న్‌షిప్ ఈ నెల 28న, రెండో విడత మే 12న ప్రారంభిస్తారని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు https://naipunyam.ap.gov.in/user&registration?page=online&short&term&internship వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279 నంబర్లలో ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకూ సంప్రదించాలని మురళి తెలిపారు.

అనధికార లే అవుట్లపై చర్యలు



రుడా వైస్ చైర్మన్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: అనధికార లే అవుట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) వైస్ చైర్మన్ కేతన్ గార్గ్ హెచ్చరించారు. అనధికార లే అవుట్లపై తీసుకుంటున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలపై రుడా పరిధిలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో శుక్రవారం ఆయన తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనధికార లే అవుట్ల వలన ప్రజలకు, డెవలప్‌మెంట్ చార్జీల రూపంలో పంచాయతీలు కోల్పోతున్న ఆదాయం, తద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కలిగే అడ్డంకులు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ప్రతి పంచాయతీ పరిధిలో వారం రోజుల్లోగా ప్రతి అనధికార లే అవుట్‌ను గుర్తించాలని ఆదేశించారు. ఆ వివరాలను పంచాయతీ కార్యాలయం నోటీస్ బోర్డు, ముఖ్య ప్రదేశాల్లో ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమం అమలుపై ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహిస్తామని, నిర్లక్ష్యం వహించే పంచాయతీ కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలకు సిఫారసు చేస్తామని కేతన్ గార్గ్ హెచ్చరించారు.

స్వామీ.. భద్రతేదీ..!

- అన్నవరం దేవస్థానంలో భద్రతకు ఏటా రూ.4.50 కోట్లు
- కానరాని లగేజీ స్కానర్లు, మెటల్, హ్యాండ్ డిటెక్టర్లు



క్యూ లైన్లలో కానరాని మెటల్ డిటెక్టర్ డోర్లు

అన్నవరం: కొద్ది రోజుల కిందట ఓ సత్రంలో మద్యం సీసాల కలకలం.. తాజాగా మద్యం తాగి ఆలయానికి వెళ్తూ పట్టుబడిన నలుగురు వ్యక్తులు.. కారులో మద్యం సీసాలు.. ఇలా వరుసగా జరుగుతున్న ఘటనలు అన్నవరం దేవస్థానంలో భద్రతా ఏర్పాట్లను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఇటీవల తనిఖీలు పెరిగినా అవి మద్యం తాగిన వారిని పట్టుకోవడానికి, మద్యం సీసాలతో రత్నగిరికి వెళ్తున్న వారిని నిరోధించడానికి మాత్రమే పరిమితమవుతున్నాయి. భక్తుల లగేజీని స్కానర్లతోను, భక్తులను మెటల్ డిటెక్టర్లతోను తనిఖీ చేయడం వంటివి దేవస్థానంలో జరగడం లేదు. దేవస్థానంలో భద్రతా చర్యలకు ఏటా రూ. 4.5 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ మొత్తాన్ని 14 మంది స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) సిబ్బందికి జీతాలు, సుమారు 40 మంది హోం గార్డులు, 60 మంది సెక్యూరిటీ గార్డులకు జీతాల రూపంలో ఖర్చు చేస్తున్నారు. వీరిలో ఆయుధాలు కలిగి ఉండే ఎస్‌పీఎఫ్ సిబ్బంది ఆలయం చుట్టూ మాత్రమే ఉంటారు. వారు 24 గంటలూ అక్కడే ఉంటారు. మిగిలిన భద్రతా విషయాలు వారి పరిధిలో లేవు. ట్రాఫిక్ క్లియర్ చేయడం, స్వామివారి ఆలయం దిగువన క్యూ లైన్ల వద్ద, రోడ్డు జంక్షన్లు, ఉత్సవాల సమయంలో భద్రతా విధుల్లో హోం గార్డులు పాల్గొంటున్నారు. సెక్యూరిటీ గార్డులు కూడా దాదాపు ఇవే బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

లగేజీ తనిఖీ నామమాత్రమే

సత్యదేవుని దర్శనానికి వస్తున్న భక్తుల లగేజీని టోల్‌గేట్ వద్ద సిబ్బంది తనిఖీ చేస్తున్నారు. ఆ సందర్భంగా మద్యం సీసాలు, మాంసాహారం, లేదా మద్యం తాగి పట్టుబడితే చర్యలు తీసుకుంటున్నారు. ఈ తనిఖీలు కూడా సాధారణ రోజుల్లోనే జరుగుతున్నాయి. భక్తుల రద్దీ అధికంగా ఉండే రోజుల్లో వాహనాల తనిఖీ సాధ్యమే కావడం లేదు. ఒక వాహనం తనిఖీ చేయడానికి 10 నిమిషాలు పడితే, ఆ సమయంలో వెనుక చాలా వాహనాలు నిలిచిపోతాయి. దీంతో తూతూమంత్రంగా తనిఖీలు చేసి పంపించేస్తున్నారు.

ఇంటెలిజెన్స్ అధికారుల సూచనలివీ..

భద్రతను కట్టుదిట్టం చేసేందుకు పోలీస్ ఇంటెలిజెన్స్ అధికారులు 2020లో అన్నవరం దేవస్థానంలో పర్యటించి, పలు సూచనలు చేశారు. దీని ప్రకారం రత్నగిరి టోల్‌గేట్ వద్ద కచ్చితంగా రెండు లగేజీ స్కానర్లు ఏర్పాటు చేయాలి. భక్తుల లగేజీ స్కాన్ చేశాక మాత్రమే ఆ వాహనాలను అనుమతించాలి. దేవస్థానం బస్సులలో వచ్చే వారి లగేజీ కూడా తనిఖీ చేయాలి. రత్నగిరి మెట్ల దారి వద్ద కూడా లగేజీ స్కానర్‌తో స్కానింగ్ చేశాకే భక్తులను కొండ పైకి అనుమతించాలి. స్వామివారి ఆలయ ప్రాంగణం లోపలకు వెళ్లే చోట, ఆలయం వద్ద, వెలుపలకు వచ్చే చోట మెటల్ డిటెక్టర్ డోర్లు ఏర్పాటు చేయాలి. ప్రతి భక్తుడిని హ్యాండ్ డిటెక్టర్లతో తనిఖీ చేశాకే లోపలకు అనుమతించాలి. స్వామివారి ఆలయానికి ఎంట్రన్స్, ఎగ్జిట్ దారులు మాత్రమే ఉండాలి. దేవస్థానంలోని అన్ని ప్రాంతాలూ కవరయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. సీసీ టీవీ ఫుటేజ్‌లు పరిశీలించడానికి సిబ్బందిని 24 గంటలూ అందుబాటులో ఉంచాలి. సీసీ టీవీ ఫుటేజ్‌లను పోలీసులు కూడా పరిశీలించాలి.

అటకెక్కిన లగేజీ స్కానర్ల ప్రతిపాదన

టోల్‌గేట్ వద్ద లగేజీ స్కానర్లు ఏర్పాటు చేయాలని 2023లో అప్పటి ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ భావించారు. ఈ మేరకు అలిపిరిలో పరిశీలన అనంతరం టోల్‌గేట్ వద్ద పెద్ద షెడ్డు నిర్మించి, భక్తుల లగేజీ స్కాన్ చేయడానికి రెండు స్కానర్లు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఆటోలు, బైక్‌ల మీద వెళ్లేవారిని కూడా టోల్‌గేట్ వద్ద తనిఖీ చేయాలని నిర్ణయించారు. ఆయన బదిలీ అనంతరం టోల్‌గేట్ వద్ద షెడ్డు నిర్మించారు తప్ప లగేజీ స్కానర్లు, ఇతర చర్యలు తీసుకోలేదు.

సాక్షిపై అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలి

- కక్షసాధింపు బాధాకరం
- పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలి
- జర్నలిస్టుల డిమాండ్
- ఏఎస్పీకి వినతి



ఏఎస్పీ సుబ్బరాజుకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయ సంఘాల నాయకులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాష్ట్రంలో అరాచకాలను ప్రశ్నిస్తూ వార్తలు రాసిన సాక్షి పత్రికపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగడం బాధాకరమని జర్నలిస్టు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, మరో ఆరుగురు పాత్రికేయ సిబ్బందిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఫర్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే), మీడియా మిత్రుల ఆధ్వర్యాన జిల్లా ఏఎస్పీ సుబ్బరాజుకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తను హత్య చేసిన టీడీపీ గుండాల అరాచకాన్ని 'సాక్షి' పత్రిక వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ హత్య కేసును పక్కదారి పట్టిస్తూ, మీడియాను భయభ్రాంతులకు గురి చేసేలా సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డితో పాటు పల్నాడుకు చెందిన సాక్షి జర్నలిస్టులపై పోలీసులు కేసులు బనాయించారు. దీనిని జర్నలిస్టు నాయకులు తీవ్రంగా నిరసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పింఛనుకు వచ్చిన వ్యక్తిని కొందరు వ్యక్తులు హతమార్చారని, దీనిపై సాక్షి కథనం ప్రచురిస్తే దానిపై కక్ష సాధింపు చర్యలకు దిగడం బాధాకరమని అన్నారు. హత్య వెనుక కుట్ర కోణంపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి, నిందితులకు కఠిన శిక్ష వేయాలన్నారు. అంతే తప్ప, అక్రమ కేసులు బనాయిస్తూ పత్రికా స్వేచ్ఛను, రాజ్యాంగ హక్కులను కాలరాయడం తగదని అన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఏఎస్పీ సుబ్బరాజు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు మండెల శ్రీరామమూర్తి, ఎన్‌టీవీ శ్రీనివాస్, సాక్షి స్టాఫ్ రిపోర్టర్ షేక్ ఫయాజ్ బాషా, సాక్షి టీవీ విలేకరి హరీష్, ఆంధ్రప్రభ గోపి, శేఖర్‌రెడ్డి, విశ్వనాథం, సత్యంబాబు, దానవాయిబాబు. గంగాధర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పసుపు ఎగుమతులతో రూ.1,876 కోట్ల ఆదాయం

- ఐదేళ్లలో రూ.6 వేల కోట్లకు పెంచేందుకు కృషి
- జాతీయ పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి



సదస్సులో వ్యూహాత్మక పత్రాన్ని విడుదల చేస్తున్న జాతీయ పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి, నిర్కా డైరెక్టర్ శేషుమాధవ్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దేశంలో ఉత్పత్తి అయ్యే పసుపునకు అంతర్జాతీయ విపణిలో భారీ డిమాండ్ ఉందని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి తెలిపారు. పసుపు ఎగుమతుల ద్వారా మన దేశానికి ప్రస్తుతం రూ.1,876 కోట్ల ఆదాయం వస్తోందని, వచ్చే ఐదేళ్లలో దీనిని రూ.6 వేల కోట్లకు పైగా పెంచేందుకు బోర్డు కృషి చేస్తోందని చెప్పారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి – జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్–నిర్కా) శుక్రవారం ఇక్కడ నిర్వహించిన పసుపు పంట భాగస్వాముల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధిక కురుకుమిన్ శాతం కలిగిన పసుపు రకాలను సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందన్నారు. మన దేశంలో గోవా మినహా 27 రాష్ట్రాల్లోనూ రైతులు పసుపు సాగు చేస్తున్నారన్నారు. మేఘాలయలో సాగు చేసే లకడాంగ్ అనే పసుపు రకంలో కురుకుమిన్ 9 నుంచి 9.5 శాతం ఉంటుందని, కొంకణ్ ప్రాంతంలో సాగు చేసే రాజాపురి రకంలో 5 నుంచి 6 శాతం ఉంటుందని వివరించారు. మన రాష్ట్రంలోని పాడేరు, లంబసింగి ప్రాంతాల్లో పసుపు సాగుకు అనుకూల వాతావరణం ఉందని చెప్పారు. సేంద్రీయ సాగుపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు. ఐసీఏఆర్–నిర్కా డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సాగు చేసే పసుపు రకాలకు భౌగోళిక గుర్తింపు తీసుకు రావడానికి కృషి చేస్తామని చెప్పారు. మన దేశం నుంచి ప్రస్తుతం 1.6 లక్షల టన్నుల పసుపు ఎగుమతి అవుతోందని, ఇది వచ్చే ఐదేళ్లలో 2.7 లక్షల టన్నులకు చేరేలా నిర్కా కృషి చేస్తుందని అన్నారు. భారత వ్యవసాయ పరిశోధన సంస్థ డైరెక్టర్, వైస్ చాన్సలర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, మన దేశంలోని నేలల్లో కర్బన్ శాతం గణనీయంగా తగ్గుతోందని, సేంద్రియ కర్బన్ శాతాన్ని పెంచడానికి మిశ్రమ పంటల సాగు చేపట్టాలని సూచించారు. రైతులకు జాతీయ పసుపు బోర్డు తగు ప్రణాళికలు అందించాలని కోరారు. జాతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు కె.సాయిరెడ్డి మాట్లాడుతూ, సాగు ఖర్చుల ఆధారంగా వ్యవసాయ ఉత్పత్తుల ధరలు నిర్ణయిస్తే రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు, విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ టి.రమేష్‌బాబు, జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ రాధికారాణి, ఐటీసీ శాస్త్రవేత్త బీఆర్ రెడ్డి కూడా ప్రసంగించారు. ఈ సందర్భంగా పసుపు పంట విశ్వవిపణిలో భారతదేశ ఆధిపత్యానికి సంబంధించిన వ్యూహాత్మక పత్రాన్ని విడుదల చేశారు. నిర్కా ఏర్పాటు చేసిన స్టాల్‌లో పసుపు ఉత్పత్తులు, విలువ ఆధారిత పదార్థాల గురించి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుమన్ కల్యాణి సందర్శకులకు వివరించారు. కార్యక్రమంలో మేనేజిమెంట్ కమిటీ సభ్యులు ఉన్నం సింహాద్రి, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	18,000
గటగట (వెయ్యి)	16,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

16 వరకు అభ్యంతరాల స్వీకరణ

కాకినాడ క్రైం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆసుపత్రులలో ఖాళీల భర్తీ కోసం 01/2025 నోటిఫికేషన్‌కు సంబంధించి అభ్యంతరాల స్వీకరణ ప్రారంభమైంది. ఈ మేరకు వైద్య సేవల సమన్వయాధికారి ఎం.పద్మ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత నెల 13వ తేదీ నుంచి 21వ తేదీ వరకు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో ఖాళీలు భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరించామన్నారు. వీటి పరిశీలన అనంతరం ప్రొవిజినల్ మెరిట్ లిస్టును htt p://eastgodavari.nic.in వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు. అభ్యర్థులు జాబితాలో తమ పేర్లు పరిశీలించుకోవాలన్నారు. శుక్రవారం నుంచి అభ్యంతరాల స్వీకరణ ప్రారంభమైందనీ, ఈ నెల 16వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. అభ్యర్థులు తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో ఉన్న జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి కార్యాలయంలో పనిదినాల్లో 16వ తేదీలోపు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య తమ అభ్యంతరాలను సమర్పించవచ్చన్నారు. వెబ్‌సైట్‌లో పొందుపరిచిన గ్రీవెన్స్ అప్లికేషన్‌లో మాత్రమే అభ్యంతరాలు నింపి సమర్పించాలన్నారు. ఈ అభ్యంతరాల పరిశీలన అనంతరం ఫైనల్ మెరిట్, అనర్హుల జాబితాలను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని ఆమె తెలిపారు.

క్షేత్రం నుంచి క్షాత్రానికి!

- రూటు మార్చిన బసవడు
- ఏటా పెరుగుతున్న ఎడ్ల పందాలు
- రూ.లక్షలు పలుకుతున్న పందెపుటెడ్లు
- ప్రత్యేక పోషణ, సాధన, రక్షణలో జాగ్రత్తలు తీసుకుంటున్న రైతులు
- గెలుపు కిక్కే వేరంటున్న యజమానులు
- నేడు చేబ్రోలులో పోటీలకు సమాయత్తం



పందేనికి సిద్ధంగా ఉన్న రంగులద్దిన బళ్లు



పందెంలో దౌడు తీస్తున్న ఎడ్లు (ఫైల్)

పిఠాపురం: వ్యవసాయంలో ప్రత్యేక పాత్ర పోషించే ఎడ్లు నేడు పరుగు పందేలలో ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. పూర్వం నుంచి ఎడ్ల పందాలు కొనసాగుతున్నప్పటికీ కొన్ని ప్రాంతాలకు పండుగలకు మాత్రమే పోటీలు పరిమితమయ్యేవి. ఆ సరదా పోటీలు నేడు మామూలు సందర్భాలలోనూ కొనసాగుతున్నాయి. గెలుపే లక్ష్యంగా రూ.లక్షలు వెచ్చించి మరీ పోటీలకు ఎడ్లను పెంచడంలో పలువురు రైతుల ఆసక్తి చూపుతున్నారు. పందెంలో గెలిస్తే వచ్చేది చిన్న మొత్తమే అయినా దాని ద్వారా వచ్చే సంతృప్తి వెలకట్టలేనిదని వారంటున్నారు. వ్యవసాయ రంగంలో యంత్ర విప్లవం రావడంతో ఎడ్ల పాత్ర గణనీయంగా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో వాటిని మరో విధంగా వినియోగిస్తున్నప్పటికీ కొందరు రైతులు ఎడ్ల బండ్ల పోటీల కోసం ప్రత్యేకంగా పెంచుతున్నారు. జిల్లాలో ప్రతి నెలా ఏదో ఒక చోట ఎడ్ల పరుగు పందాలు జరుగుతుండగా రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి పందేల కోసం రైతులు తమ ఎడ్లను తీసుకుస్తున్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శనివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పందాలు నిర్వహించనున్నారు. జిల్లాలో లైను పందాలు ఆడుతుండగా, ఇతర జిల్లాల్లో రౌండు పందాలు ఆడుతుంటారు.

వీటికి సెపరేటు

పరుగు పందాలలో పాల్గొనే ఎడ్లకు గిత్తల ప్రాయం నుంచి ప్రత్యేక శిక్షణ ఇస్తుంటారు. కేవలం ఒక సంవత్సరం వయసు నుంచే చిన్న సైజు బండ్లకు కట్టి పరుగులో శిక్షణ ఇస్తుంటారు. సాధారణ ఎడ్లలా కాకుండా నిత్యం బండి కట్టి పరుగులు పెట్టిస్తు సమయానుకూలంగా దూరాలను లక్ష్యంగా పెట్టి పరుగు పెట్టిస్తుంటారు. సాధారణంగా మైసూరు, దేశవాళీ ఎడ్లను పరుగు పందేలకు వినియోగిస్తారు. పరుగు పందేలలో పాల్గొనే ఎడ్ల ఖరీదు రూ.లక్షలు పలుకుతోంది. ఒక్కో ఎద్దు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పలుకుతుంది. ఒక రకంగా ఒకే జాతికి చెందిన రెండు ఎడ్లను కొనడానికి ఎంత ఖర్చైనా రైతులు వెనుకాడడం లేదు. ఇతర జిల్లాలకు వెళ్లి మరీ రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు.

మేతలోనే సత్తా

పందాలలో పాల్గొనే ఎడ్లకు ప్రత్యేకమైన మేతతో మేపుతుంటారు. కేవలం ప్రత్యేకమైన దాణా పెడుతుంటారు. ఉలవలు, రాగులు, జొన్నలు, నిత్యం ఉడకబెట్టి నానబెట్టిన ఎండుగడ్డి ముక్కలలో వేసి దాణాగా మేపుతారు. వీటి మేతకు సంవత్సరానికి సుమారు రూ.3 లక్షల వరకు వ్యయమవుతుందని రైతులు చెబుతున్నారు. పందేలు ఉన్నా లేకపోయినా వీటి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తప్పదని, మేతలో ఎప్పుడు మార్పు లేకుండా ఖర్చుకు వెనుకాడకుండా మేపాల్సి ఉందంటున్నారు.

ఎడ్లకు ఎయిర్ కూలర్లు

కంటిలో లోపం రాకుండా దుమ్ము ధూళి పడినా కంటి చూపు దెబ్బతినకుండా లక్ష్యం వైపు దూసుకుపోయే విధంగా పందెం ఎడ్ల కళ్లకు కాటుక పెడుతుంటారు. పరిగెట్టి అలిసిపోయిన ఎడ్లకు మనుషుల మాదిరిగానే జండూబామ్ వంటి మందులతో మసాజ్ చేస్తుంటారు. రాత్రి సమయాల్లో ఈగలు, దోమలు కుట్టకుండా దోమ తెరలతో పాటు ప్రత్యేకంగా ఎయిర్ కూలర్లు వాడుతున్నారు.



ఎడ్లకు ఎయిర్‌కూలర్లతో రక్షణ

బండి సదుపాయాలు ప్రత్యేకమైనవి

సాధారణంగా బరువులు లాగే ఎడ్ల బళ్లు చాలా బరువుగా పటిష్టంగా పెద్దపెద్ద చక్రాలతో ఉంటాయి. ప్రస్తుతం ఆ చెక్క చక్రాల స్థానంలో టైర్లు వచ్చాయి. గతంలో కేవలం ప్రత్యేకమైన చెక్కతో చేసిన చక్రాలు గల బళ్లు ఉండేవి. కాని పరుగు పందాలలో ఉపయోగించే బళ్లు మాత్రం ప్రత్యేకంగా తయారు చేయిస్తారు. బరువు తక్కుగా ఉండేలా పటిష్టంగా చిన్న సైజులో అందంగా తయారు చేయిస్తారు. వాటికి వివిధ రంగులు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు.

పది నిమిషాల పరుగుకు పది నెలల సాధన

పందెంలో ఎద్దు పది నిముషాలు పరుగు పెట్టాలంటే పది నెలల ముందు నుంచి ప్రత్యేక శిక్షణ, ప్రత్యేక సంరక్షణ ఉంటుంది. ఎంతో శ్రమకోర్చి వాటిని పెంచి పోషిస్తుంటాం. ఎడ్ల పందేలు మన సంప్రదాయం. ఎన్నో ఏళ్లుగా మా తాతల నాటి నుంచి కొనసాగిస్తున్నాం. పందేల్లో పాల్గొనడం మాకు చాలా ఆనందంగా ఉంటుంది. ప్రతి రోజు పరుగులో శిక్షణ ఇస్తుంటాం. మేతకు ఎక్కువ ప్రాధాన్యనిస్తాం. బలవర్ధకమైన ఆహారాన్ని ఇవ్వాల్సి ఉంటుంది.

– రవీంద్రనాథ్ చౌదరి, రైతు, మండపేట



ఆనందం కోసమే అంత కష్టం

మా కుటుంబంలో పూర్వం నుంచి ఎడ్లను పోషిస్తున్నాం. ముఖ్యంగా పరుగు పందేలంటే మాకు చాలా ఇష్టం. ఏటా వీటి పోషణకు రూ.లక్షలు ఖర్చు అవుతున్నా పోటీలలో గెలుపు సాధించినప్పుడు వచ్చే ఆనందం వెల కట్టలేనిది. అందుకే ఎంత ఖర్చయినా లెక్క చేయం. వీటిని కంటికి రెప్పలా చూసుకుంటాం. వాటికి అనేక సౌకర్యాలు కల్పించి కాపాడుకుంటాం.

– కుర్రా పురుషోత్తం, రైతు, బాపట్ల



స్తంభాన్ని ఢీకొట్టిన కారు



మొగలికుదురులో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి దెబ్బతిన్న కారు

మామిడికుదురు: మొగలికుదురు గ్రామ పంచాయతీ సమీపంలోని కడలి రోడ్డులో శుక్రవారం తృటిలో ప్రమాదం తప్పింది. కాకినాడ నుంచి వెళ్తున్న కారు రోడ్డు పక్కన ఉన్న పంట కాలువ పావంచాను ఢీ కొట్టి దాని పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. దానికి ఉన్న సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ దూరంగా పడింది. ఈ సమయంలో సమీపంలో ఎవరూ లేక పోవడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. కాకినాడ నుంచి భీమవరం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

గుర్రాల జోరు.. కుర్రకారు హుషారు!

- చేబ్రోలులో ఉత్సాహంగా గుర్రప్పందేలు
- విజేతలకు బహుమతులు అందజేత



పరుగుతో దుమ్ము రేపుతున్న గుర్రం

పిఠాపురం: రేసు గుర్రాల గిట్టల హోరుతో గొల్లప్రోలు మండలం చేబ్రోలు మారుమోగింది. ఉత్కంఠ మధ్య రెప్ప పాటులో గమ్యాన్ని చేరుకోడానికి గుర్రాలు దౌడు తీస్తుంటే రేగిన దుమ్ములో జనం కేరింతలు కొట్టారు. ఎప్పుడో పదేళ్ల క్రితం జిల్లాలో సామర్లకోటలో జరిగిన గుర్రప్పందేలు తరువాత మళ్లీ ఇప్పుడే జరగడంతో వాటిని చూసేందుకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. చేబ్రోలులో శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి గుర్రాల పరుగు పోటీ నిర్వహించారు. ఏటా ఈ పందేలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది కొత్తగా గుర్రప్పందేలు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 35 గుర్రాలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఈ పందాల్లో చేనుల అగ్రహారం మణికి చెందిన జెస్సీ గుర్రం ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. రామన్నపాలేనికి చెందిన చోడమాంబిక గుర్రం విక్రమ్ రెండోస్థానాన్ని, అంకుపాలేనికి చెందిన మోదమాంబకు చెందిన గుర్రం మురుగన్ మూడోస్థానాన్ని కైవసం చేసుకుంది. ఆర్ఆర్ పేటకు చెందిన దాడి రాముడు గుర్రం భగి, సింగపూర్ సత్యనారాయణకు చెందిన గుర్రం దేవర, కోటనందూరుకు చెందిన శివరాజ్ బ్రదర్స్ గుర్రం రాఖీ, సామర్లకోటకు చెందిన జగదీష్ రాజా గుర్రం, శివరాజ్ బ్రదర్స్ గుర్రం చిన్ని, ఆర్ఆర్‌పేటకు చెందిన దాడి నూక హనుమంత్ గుర్రం కాళీ, చోడమాంబిక గుర్రం రాకెట్ వరుసగా నాలుగు నుంచి పది స్థానాల్లో నిలిచి బహుమతులు గెలుచుకున్నాయి. విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు బహుమతులు అందజేశారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి



కూలీకి ఇంజెక్షన్ చేస్తున్న వైద్యురాలు

సీతానగరం: మండలంలోని వంగలపూడిలో ఉపాధి కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. వంగలపూడిలో కాలువ పూడిక తీతకు శుక్రవారం 130 మంది కూలీలు వెళ్లారు. వారిలో ఐదుగురు కూలీలు కాలువపై ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. ఇంతలో తేనె తుట్టెపై ఉన్న ఈగలు ఒక్కసారిగా వచ్చి వారిలో ముగ్గురిపై దాడి చేశాయి. సమాచారం అందుకున్న ఏపీఓ బీవి సత్యవతి సంఘటన స్థలానికి వెళ్లి తేనెటీగల దాడికి గురైన కోడెల్లి గంగరాజు, ఆరుగుల వెంకటేశ్వర్లు, ఓరిగంటి పాపలను సీతానగరం పీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలు అందించారు. ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వృద్ధుడు

మామిడికుదురు: నగరం గ్రామంలో ఓఎన్‌జీసీ రిఫైనరీ గేటు ఎదురుగా 216వ నెంబర్ జాతీయ రహదారిపై లారీ సైకిల్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే పి.గన్నవరం మండలం మానేపల్లికి చెందిన కోన వెంకట్రావు (70) రిఫైనరీ గేటు ఎదురుగా ఉన్న హోటల్‌లో టిఫిన్‌కి వెళ్లాడు. అక్కడ టిఫిన్ లేక పోవడంతో పక్కనే ఉన్న మరో హోటల్‌కి వెళ్లి సైకిల్ నడిపించుకుంటూ రోడ్డు దాటుతున్నాడు. అప్పటికే కదలిన ఓఎన్‌జీసీ మెయింటెనెన్స్‌కు సంబంధించిన లారీ ప్రమాదవశాత్తూ వృద్ధుడిపై నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటనలో లారీ వెనుక చక్రం వృద్ధుడి పొట్ట కింది భాగం నుంచి వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న 108 వాహనం వచ్చి అందులోని సిబ్బంది సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు సైకిల్ ఢీకొని..

ముమ్మిడివరం: నడిచి వెళుతున్న వ్యక్తి మోటారు సైకిలిస్టు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొమానపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తకాలువకు చెందిన శీలం నాగేశ్వరరావు (54) గురువారం సాయంత్రం కూలిపనికి వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు దాటుతుండగా యానాం నుంచి వస్తున్న మోటారు సైకిలిస్టు అతనిని ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావును అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్య సేవలు అందించిన తరువాత ఇంటికి తీసుకు వచ్చి శుక్రవారం ముమ్మిడివరం ప్రవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. నాగేశ్వరరావు కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని..

తుని: అన్నవరం–రావికంపాడు మధ్యలో రైలు ఢీకొని (45) ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. మృతుడు నలుపు, తెలుపు, ఆరెంజ్ రంగు అడ్డచారల టీషర్ట్, సిమెంట్ రంగు ఫ్యాంట్ ధరించాడని, కుడిచేయి దండపై పెద్దసైజు టాటూ ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య

అల్లవరం: మండలం తాడికోన గ్రామానికి చెందిన గెద్దం నాగమణి పురుగుమందు తాగి చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్టు ఎస్సై తిరుమలరావు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ అయిన ఆమె ఇటీవల ఇల్లు నిర్మించి అప్పుల పాలై గత నెల 23న హార్పిక్‌లో గడ్డి మందు కలిపి తాగింది. సుమారు 20 రోజుల పాటు అమలాపురంలోకి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవం

చాగల్లు: మండలంలోని ఊనగట్ల గ్రామంలో మతి స్థిమితం లేని 16 ఏళ్ల బాలికను అపహరించి అత్యాచారం చేసిన ఘటనలో రాజమహేంద్రవరం నామవరానికి చెందిన నందా శ్రీను అనే వ్యక్తికి యావజ్జీవ కారాగారశిక్ష విధిస్తూ ఏలూరు పోక్సో కోర్టు జడ్జి ఎస్.ఉమా సునంద తీర్పు ఇచ్చినట్టు ఎస్సై కె.నరేంద్ర శుక్రవారం తెలిపారు. 2017 జూలై 19న బాలికపై అత్యాచారం చేయడంతో తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో నందా శ్రీనుపై అప్పటి ఎస్సై జయబాబు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ కారాగారశిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.



యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్



యుద్ధ నౌకపై హెలికాప్టర్ విన్యాసాలు

భద్రతా లక్ష్యాల సాధనలో..

- ముగిసిన టైగర్ ట్రయంఫ్–2025
- విన్యాసాలు చేయడం గర్వంగా ఉందన్న యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్



ఉభయచర ల్యాండింగ్ డ్రిల్‌లో పాల్గొన్న యుద్ధ ట్యాంకర్లు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): భారత్, అమెరికా దేశాలు సంయుక్తంగా కాకినాడ బీచ్‌లో నిర్వహిస్తున్న ఎక్సర్‌సైజ్ టైగర్ ట్రయంఫ్ శుక్రవారం ఘనంగా ముగిసింది. హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ మానవత సహాయ, విపత్తు ప్రతిస్పందన, కాల్పనిక ప్రకృతి వైపరీత్యం తరువాత ఫీల్డ్ ఆసుపత్రి ఏర్పాటు, సరఫరా, పంపిణీ ప్రదేశాలను ఏర్పాటు చేయడం వంటి బాధ్యతలను సంయుక్త బలగాలు చేపట్టాయని తెలిపారు. భారత్‌తో కలిసి రెండో సారి ఈ విన్యాసాలు చేయడం గర్వంగా ఉందన్నారు. టైగర్ ట్రయంఫ్ వంటి వ్యాయామాల ద్వారా యూఎస్, భారత్ పరస్పర భద్రతా లక్ష్యాలు సాధించడానికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వారం రోజుల పాటు జరిగిన వ్యాయామం, ఉభయచర ల్యాండింగ్ తదితర అంశాలు ముగిసాయని తెలిపారు. విశాఖలో వారంరోజుల పాటు ఆపరేషన్ ప్రణాళిక, యూనిట్–స్థాయి శిక్షణ, సబ్జెక్ట్ నిపుణుల మార్పిడి, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయన్నారు. యూఎస్ నేవీకి సంబంధించిన విడ్‌బే ఐలాండ్, క్లాస్ డాక్ ల్యాండింగ్ అధికారికంగా జరగాల్సిందన్నారు. ఏప్రియల్ 1న జలాశ్వలో ప్రారంభమైన ఈ వేడుకలో 3 వేల మంది సిబ్బంది, నాలుగు నౌకలు, ఏడు విమానాలు పాల్గొన్నాయని తెలిపారు.



సైనికాధికారిని కలసిన కలెక్టర్ షణ్మోహన్

రాష్ట్రస్థాయి హాకీ విజేత కాకినాడ



విజేత కాకినాడ బాలుర జట్టుతో డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఈనెల 6 నుంచి 9 వరకు జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల జూనియర్స్ హాకీ పోటీలలో కాకినాడ జిల్లా బాలుర జట్టు విజేతగా నిలిచిందని జిల్లా హాకీ సంఘ కార్యదర్శి నంబు శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. జిల్లాల విభజన తరువాత సాధించిన ఈ విజయం జిల్లాకు గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం కాకినాడ డీఎస్ఏలో జరిగిన కార్యక్రమంలో డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్, పీడీలు రవిరాజు, నూకరాజు, సూరిబాబు, సునీల్, పరశురాం, డిఎస్ఏ హాకీ కోచ్ నాగేంద్రలు విజేతలను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాకారులకు సూచించారు.